సూర్య
www.suryaa.com
ఆదివారం
05.11.2023



# మాలధారణం నియమాల తోరణం

## చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**అమెరికా వెళ్లాలన్నది ప్రపంచ దేశాల్లోని చాలా మంది పౌరుల కల. అయితే అమెరికా వీసా నిబంధనలు, అనుమతులు రావడానికి పట్టే సమయం పెరుగుతుండటంతో ఎలాగైనా సరే ఆ దేశంలోకి వెళ్లాలని కొందరు ప్రయత్నిస్తూ అడ్డంగా బుక్ అయి-ఎపోతున్నారన్న వార్తలు ఆందోళన కరం. మీరేమంటారు.**

**– పట్నాన రాజశేఖర్, విశాఖపట్నం**

మీరన్నది నిజమే రాజా గారూ...అమెరికా వీసా నిబంధనలు ఉల్లంఘిస్తు అక్రమ మార్గంలో వెళ్తున్న వారు ఎక్కువవుతున్నారన్న ఆందోళన ఆ దేశంలోనూ ఎక్కువైందన్నది నిజం. అక్రమ మార్గాల్లో ప్రవేశించే వారిపై అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఎప్పటికప్పుడు కొరఢా ఝుళిపిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే అనుమతులు లేకుండా ప్రవేశిస్తున్న వారిని అరెస్ట్ చేస్తున్నారు. అయితే ఒక్క ఏడాదిలోనే దాదాపు 97 వేల మంది భారతీయులు అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించారని అమెరికా అధికారులు వెల్లడించారు. గత ఏడాది అక్టోబరు 1 వ తేదీ నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30 వ తేదీ మధ్య అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నం చేసి దొరికిపోయిన భారతీయుల వివరాలను అమెరికా విడుదల చేసింది. మొత్తం 96,917 మంది భారతీయులు ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దు దాటేందుకు ప్రయత్నించి దొరికిపోయారని.. వారిని అరెస్టు చేశామని అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ 97 వేల మందిలో 30 వేల మంది కెనడా సరిహద్దు వద్ద.. దాదాపు 42 వేల మంది మెక్సికో సరిహద్దు వద్ద పట్టుబడినట్లు తెలిపింది. ఏది ఏమైనా విసా నిబంధనల మేరకు వెళ్లాల్సిన బాధ్యత ఉందన్నది మాత్రం వాస్తవం.

**జికా వైరస్. ఒకప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. ఇటీవల పూర్తిగా తగ్గుముఖం పట్టినా.. తాజాగా వెలుగు చూడటం మరోసారి సంచలనంగా మారింది. ఇది దేశంలో ప్రాణాంతకంగా మారి విస్తరిస్తోందన్న ఆందోళన సర్వత్రా ఉంది. మీరేమంటారు**

**– గెంబలి జగదీశ్వరరావు, విజయవాడ**

మీరన్నది నిజమే... జగదీష్... దేశంలో జికా వైరస్ గుర్తింపు నేపథ్యంలో ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. దోమల ద్వారా ప్రబలే జికా వైరస్ గర్భిణీలకు పెను ప్రమాదకరమని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ముందుగా ఈ జికా వైరస్ శిశువుకు వ్యాపించి అక్కడి నుంచి మెదడుకు వ్యాపించి మైక్రోసఫాలి అనే తీవ్రమైన సమస్యలకు కారణం అవుతుంది. ఇది చిన్నారుల మెదడు బలహీనం చేయటంతో ఆటిజం వ్యాధితో బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నది అధికారులు చెపుతున్న మాట.. అయితే ప్రస్తుతానికి జికా వైరస్ సోకినవారికి ఇచ్చే ప్రత్యేకమైన చికిత్సలు గానీ.. టీకాలు గానీ లేనటట్టు చెప్పడమే ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలోనే దోమల నుంచి రక్షించుకోవడమే ఉత్తమమైన మార్గమని అధికారులు చెపపుతున్న మాట ఆచరణీయం.. చలికాలం వస్తున్నందున దోమల సంతతి పెరిగే అవకాశం ఉందని వాటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి కూడా ఉందనటంలో సందేహంలేదు.

**అయోధ్యలో దివ్యమైన భవ్యరామమందిర నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సంక్రాంతి తర్వాత అయోధ్య ఆలయంలో రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయాలని ఇప్పటికే ఆలయ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారన్న కథనాలు వస్తున్నాయి. రాజకీయాలు మతంతో ముడిపెడుతున్నట్టు కనిపించడంలేదా? మీరేమంటారు.**

**– ఎస్. కృష్ణప్రసాద్, హైదరాబాద్**

అవును ప్రసాద్‌గారూ అయోధ్యలో దివ్యమైన భవ్యరామమందిర నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్యే అవకాశాలు ఉన్నాయాయి. ఆలయ తుది దశ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి కానుండగా.. వచ్చే ఏడాది జనవరి 22 వ తేదీన అయోధ్య రామమందిరంలో రాముడు కొలువుదీరనున్నాడు. దీనికి సంబంధించి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఇప్పటికే తేదీని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే అయోధ్య రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించి అతిథులను ఆహ్వానించే పనిలో ట్రస్ట్ సభ్యులు తలమునకలై ఉన్నారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఢిల్లీలోని ఆయన నివాసంలోకి వెళ్లి.. రామాలయ ప్రాణ ప్రతిష్ఠకు హాజరు కావాలని ట్రస్ట్ సభ్యులు ఆహ్వాన పత్రికను అందించారు. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలుస్తోంది. భారతీయుల మనోభావాలలో రామాలయం కూడా ఒకటి. దీనిని మతంతో ముడిపెట్టడం సరికాదన్నది నా అభిప్రాయం. 2024 జనవరి 22 వ తేదీన అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ క్రమంలోనే ఆలయ ఆవరణలో ఉన్న రామ్ లల్లా విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ.. కొత్త ఆలయంలోని గర్భగుడిలోకి తీసుకువెళ్లనున్నారని సమాచారం. ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం మొత్తం ప్రధాని మోదీ చేతుల మీదుగానే జరగనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా చాలా మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాట్లు చేస్తోంది.

## లెజెండ్

# సాహితీ మహారథి దాశరథి



“నా తెలంగాణ కోటి రతనాల వీణ’ అని నినదించి నిజాంపాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి...“ ఓ నిజాము పిశాచమా? కాన రాదు / నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూపళ్ళు తోముకోవడాని కిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా ) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగిం చిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. ‘నా గీతావళి ఎంత దూరము ప్రయా ణం బౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద’ అని ఆయన నినదించారు. ‘నను గని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ’ అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. ‘అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం అనాథునికీ ఆగర్భ శ్రీమంతునికీ మధ్య’ అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు.తెలంగాణ ప్రజల కన్నీళ్లను ‘అగ్నిధార’ గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథిగా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. “నా తెలంగాణ కోటి రతనాల వీణ” అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మా నియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనం లోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు.

ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకు న్నాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు.”మా నిజాం రాజు జన్మజన్మల బూజు”.రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరి కంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్’ అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహా సభలో చైత న్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవిం చాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. . మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగా లతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్య క్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయి తీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకు న్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి.అగ్ని ధారను తన జైలు సహ వాసి.. వట్టికోట అళ్వారు స్వామికి అంకితమిచ్చాడు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చాడు. ఈయన రాసిన ‘తిమి రంతో సమరం’ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. ‘కవితా పుష్పకం’ అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ బహుమతి లభిం చింది. దాశరథి ‘బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును’ రాశారు. గీతగోవింద వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యా లయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు.రుద్రవీణ, మహాంద్రోదయం, మార్పు నా తీర్పు, ద్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం ). మస్తిష్కంలో లేబరేటరీ ( విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనుదించినది %--% దాశరథి. హీరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో వచ్చిన ‘వాగ్దానం’ చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. ‘నా కంటిపాపలో నిలిచిపోరా/ నీ వెంట లోకాలు గెలువనీరా’ అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన ‘ఇద్దరు మిత్రులు’ సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే ‘ఖుషీ ఖుషీగా నవ్వుతూ’ అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి ‘నవమి’. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు.“జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే..” అన్నారాయన.

అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు%ో% అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు / నా తెలంగాణ కోటి రత్నాల వీణ.” (అగ్నిధార ) ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి. తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే”.కోటి కోటి దీపాలనేనురా తెలగాణ నిగళాల తెగగొట్టి ఆకాశమంతను బాటలలో, కోటలలో నాటండి ప్రజల్లారా.. వేటాడండి తమస్సును..“అనాదిగా సాగుతోంది %--% అనంత సంగ్రామం / అనాథునికీ ఆ గర్భశ్రీనాథునికీ మధ్య”. ఉన్నదాన్ని వున్న వాళ్లందరిలో పంచి / ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి”...గతాన్ని కాదనలేను %--% వర్తమానం వద్దనబోను / భవిష్యత్తు వదులుకోబోను %--% కాలం నాకంతమాల”...

హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను / శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సాల్వేషన్”... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...**
**9440595494**

## నవ కవిత్వం

# విశాల హృదయం



నేనో అనంత విశాల
గగనాన్ని
సహృదయ తారల్ని మోసే
పల్లకిని
కపట బుద్దుల ఉల్కల్ని విదిల్చి
కొట్టే తుఫానుని

నేనో చల్లని మేఘాన్ని
హర్షానికి కురిసే వర్షాన్ని
వర్షాన్ని కన్నీటికి గురిచేసే
కర్మషులకు
ఉరిమే మేఘాన్ని

నేనో మెరుపుని
వెలుగులు పంచే శంపాలతని
వెలుతుర్ని చీకటిపాల్జేసే
నిశాచరుల
భరతంపట్టే విద్యుత్తరంగాన్ని

నేనో ఇంద్రధనస్సుని
ప్రేమ దయాగుణ
హృదయాలకు నెలవుని
అన్యాయపు గుండెల్ని
మసిచేసే పిడుగుని

నేనో సువిశాల నిర్మల
హృదయాన్ని.

**– నాగముని. యం**
**9490856185**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**


ఈ ఆదివారం అనుబంధంలో ఆంధ్రమెడిఆక్ కళాశాల ఏర్పడి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం అనుబంధంలో ప్రత్యేక కథనం ప్రచురించడం హర్షణీయం. సవివరణ పూర్వక కథనం అందించిన రచయితకు, సూర్య యాజమాన్యానికి ధన్యవాదాలుసందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసాలు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మరచిపోయి బావదారిద్రంలో ఉన్న వారికి ఉపయోగపడుతుందని నా మనవి.

**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**



**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్థవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చుకోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**

# నిద్ర @ కండీషన్స్ అప్లై..!



ప్రశాంతంగా నిద్ర పోవాలంటే
దినసరి వ్యాపారాల్ని
ఓవరుకోటులా విడిచి
హాంగరుకి తగిలించి పక్కకు
పెట్టాలి
మంచంపై కొంత తేలిక పడాలి..!

నీ రంగు రంగుల ఇంద్ర
భవంతిలో
ఎన్ని కాంతుల ధగధగలు ఉన్నా
చిక్కని చీకటితో దోస్తీ చేస్తూ
తల్పంపై నీ తనువు సేద తీరాలి!

నువ్వెంతటి స్థితిమంతుడవైనా
కావచ్చు
నువ్వెంతో ఉన్నత స్థాయిలో
ఉండవచ్చు
అయినా వీటన్నింటినీ
మూసే నీ కన్నుల వాకిట
వదలాలి..!

బలవంతంగా బ్రాండెడు పెగ్గుల
నిశాతోనో
మోతాదుకు మించి అల్జొలాం
టాబ్లెట్లతోనో
మొండి చేసి నిద్ర పోవాలంటే
మాత్రం
మగతగా తూలిపోయే మత్తే గతి..!


నిద్రకు ఉన్నోడు లేనోడు తేడా
లేదు
వయసుతో నిమిత్తం లేదు
కులం మతంతో సంబంధం లేదు
వర్గం, ప్రాంతం అసలేదీ లెక్క
కాదు..!

పగలంతా శ్రమతో అలసి సొలసి
గడిచిన కాలాన్ని రేపటి
కలవరాన్ని కట్టి పెట్టి
చిన్న పిల్లాడిలా నిశ్చింతగా
సోలిపోతే
నిదురమ్మ నిను చక్కగా కరు-
ణిస్తుంది..!

అప్పుడే రాత్రి పట్టే ఆ గాఢ నిద్ర
కొన్ని గంటల చీకట్లను
తీసుకొచ్చినా..
ఉదయం లేవగానే ప్రాణం
నీలో కొంగొత్తగా వికసిస్తుంది..!!


**డా. వాసాల వరప్రసాద్,**
**9490189847,**

ఫన్ చ్











నారు

# సూర్య బుడత



## బాలల కథ

## నేటి బాలలే రేపటి పౌరులు


కళింగ రాజ్యంలో చంద్రాంగదుడు అనే రాజు పాలించుండెను. ఆ రాజు కుమారుడు యువరాజు అయిన వీరసేనుడు. అతడు విద్యార్థి దశలో ఉన్నాడు. అనేక బల, అతి బల విధ్యలు నేర్చుకున్నాడు. అతడు రోజు అడవికి జంతువులను వేటాడ్డానికి వెళ్తుండేవాడు. ఒక రోజు అడవిలో కొలను దగ్గర నీళ్లు తాగే శబ్దం విని జంతువు అనుకుని బాణం వేశాడు. తరువాత అక్కడికి వెళ్లి చూసేసరికి అతనికి కళ్ళు అబ్బురపడ్డాయి. అక్కడ చూడగా ఒక ముని కుమారునికి బాణం తగిలింది. ఆ బాలుడు పడిపోయి ఉన్నాడు. వెంటనే వీరశేనుడు ఏమి చేయాలో తోచక రారాజు అయిన తన తండ్రి చంద్రాంగుడు దగ్గరకు వెళ్లి చెప్పాడు. అప్పుడు రాజు, రాణి,యువరాజు బటులతో కలిసి అడవిలో కొలను దగ్గరకు వెళ్లి చూశారు. అక్కడ బాలుడు లేడు. బటులు చుట్టూ ప్రక్కల వెతికారు. దగ్గర్లో ఒక గురుకుల పాఠశాల ఉంది అని రాజుకు చెప్పారు. అప్పుడు రాజుగారు అంతా కలిసి ఆ గురుకులానికి వెళ్లారు. అక్కడ గురువుగారికి రాజు ఇక్కడ కొలను దగ్గర బాలుడికి బాణం తగిలి పడిపోయాడు. ఆ బాణం మా యువరాజు వేశాడు. ఇప్పుడు చూస్తే ఆ బాలుడు అక్కడ లేడు అని నిజాయితీగా, ధర్మబద్ధంగా రారాజు అడిగారు. గురువుగారు రాజు గారి ఔన్నత్యానికి మెచ్చుకొని నమస్కరించి ఇలా చెప్పారు. ఆ బాలుడు మా గురుకులం విద్యార్థి. ఇదిగో వీడే బ్రతికే ఉన్నాడు చూడండి అని అన్నాడు. అప్పుడు యువరాజు ఈ బాలుడే అని రాజు కి చూపిస్తూ అన్నాడు. రాజుగారు ఆశ్చర్యంగా చూశారు. మా విద్యార్థులు క్రమశిక్షణ వాళ్ళకి శ్రీరామరక్ష అని గురువుగారు అన్నారు. గురువుగారు చెప్పిన క్రమశిక్షణ పాఠాలు రారాజు అచ్చు వేయించి నేటి తరానికి అందించారు అది ఏమిటంటే!!

ఓ! విద్యార్థులారా! మీకు చిన్న వయసులో తల్లి , తండ్రి , గురువు హితం చెబుతారు. వయసుకు వచ్చిన తరువాత మంచి వ్యక్తుల మధ్య ఉండాలి.ఆ నాడు రాముడు లాంటి మంచి మనుషులు దగ్గర రావణాసురుడు వంటి చెడ్డ వ్యక్తులు ఉన్నారు.ఇప్పుడు కూడా అంతే. ఆ నాడు సీత, సావిత్రి, మండోదరి, అహల్య వంటి పతివ్రతలు ఉన్నా, కైకేయి మందర సూర్పనఖ లాంటి చెడ్డవారు ఉన్నారు. ఇప్పుడు కూడా అంతే విద్యార్థుల్లారా !!!...మీరు మంచి వ్యక్తులతో స్నేహం చేయాలి. అనేక మంది యోధులు పుస్తకాలు చదవండి. క్రమశిక్షణ పాటించాలి. 1. ఉదయాన్నే ఐదు గంటలలోపు లేచి వ్యాయామం చేయాలి. 2. మనసుని నియబద్ధంగా ఉండడానికి యోగ చేయండి. 3. మంచి ఆలోచన శక్తి పెరగడానికి మంచి పుస్తకాలు చదవండి. 4. బద్ధకం వినండి. రేపు చూద్దాం చదువుదాం అన్నది , ఈ రోజే చేయాలి, చదవాలి అన్నట్లు ఉండాలి. 5. పెద్దల నుండి మంచి మాటలు నేర్చుకోవాలి. 6.సత్యం పలకాలి.అబద్ధాలు ఆడకూడదు. ఒక అబద్ధం ఆడితే 100 అబద్ధాలు ఆడవలసి ఉంటుంది. 7. బ్రహ్మచర్యం, విద్యార్థి దశలో చదువుకే ప్రాధాన్యత ఇవ్వాలి. టెక్నాలజీ, సోషల్ మీడియాకు అలవాటు పడకూడదు. ఈ ఏడు క్రమశిక్షణ సూత్రాలు పాటిస్తే మీ భవిష్యత్తు బంగారు బాటవుతుంది. ఈ సూత్రాలు పాటించడం వలన గురుకులం విద్యార్థులకు బాణం తగిలిన ప్రాణం పోలేదు.


నేటి తరం విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి. నేను చదవలేను నావల్ల కాదు, నాకు ర్యాంకులు రావు అని బద్ధకం పడి, టీవీలకు మరియు సెల్ కి అంకితం అవుతున్నారు. టెన్షన్ కి గురవుతున్నారు. ఆత్మహత్యల పాలవుతున్నారు. ఓ భారత్ మాత ముద్దుబిడ్డల్లారా !!!ఈ నాటి ప్రభుత్వం మీ బంగారు భవిష్యత్ కోసం ఎన్నో, ఎన్నెన్నో పదకాలు ఇస్తుంది. దానిని అందుకని మీ చదువుని సద్వినియోగం చేసుకొని గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యం స్థాపించండి. నేటి విద్యార్థులే రేపటి గాంధీజీలుగా మారండి. భారతదేశం మన మాతృభూమి భారతదేశాన్ని మహోన్నత దేశముగా తీర్చిదిద్దండి. "నేటి విద్యార్థులే రేపటి భారతదేశం", అని గురువుగారు బోధించారు.


జైహింద్





# 15వ దైవ ప్రవక్త మూసా అలైహి సలాం 3వ భాగం

గత పాఠం తరువాయి: మంత్రగాళ్లు మూసా అలైహిస్సలాం గారి దైవికమైన అద్భుతాన్ని చూసి ఇది మంత్రం కాదని దైవికమైన నిదర్శనమని నమ్మి వారు: మేము విశ్వసించాము మూసా, హారూన్ ల అల్లాహ్ ను అని సాష్టాంగంలో పడిపోయారు.

ఫిర్ఔన్ ఇలా అన్నాడు: నేను మీకు అనుమతి ఇవ్వకముందే మీరు అతన్ని విశ్వసించారా? నిశ్చయంగా ఈ రాజధాని నగరంలో దాని పాలకులను అధికారం నుండి తొలగించడానికి మీరంతా కలసి రహస్యంగా పన్నిన కుట్ర ఇది. సరే అయితే దాని ఫలితం మీకు ఇప్పుడే తెలుస్తుంది. నేను మీ చేతులను మీ కాళ్ళను వ్యతిరేక దిశలో నరికిస్తాను. ఇంకా దాని తర్వాత మీ అందరినీ శిలువనెక్కిస్తాను.

మంత్రగాళ్లు ఇలా జవాబు పలికారు: ఎట్టి పరిస్థితులలోనూ మేము మరలవలసింది మా ప్రభువు వైపునకే. నీవు ఏ విషయంలో మాకు పగ తీర్చుకోదలిచావో అవి మా ప్రభువు సూచనలు.అవి మా ముందుకు వచ్చినప్పుడు, మేము వాటిని విశ్వసించామనేది తప్ప మరొకటి కాదు. ఓ మా ప్రభువా మాకు ఓరిమిని అమితంగా అనుగ్రహించు. మమ్మల్ని ప్రపంచంలో నుండి లేపినప్పుడు మేము నీకు విధేయులుగా ఉన్న స్థితిలోనే లేపు.

అల్లాహ్ మూసాతో అన్నాడు: రాత్రికి రాత్రే నా దాసులను తీసుకొని వెళ్ళిపో. మిమ్మల్ని తప్పక వెంటాడడం జరుగుతుంది. అని మేము మూసాకు (వహీ) సందేశం పంపాము. తర్వాత ఫిర్ఔన్ సైన్యాన్ని సమాయత్త పరిచే నిమిత్తం పట్టణాలలోకి వార్తాహరులను పంపి ఇలా ప్రకటన చేయించాడు: వీరు గుప్పెడు మంది మాత్రమే. మాకు బాగా కోపం తెప్పించారు. మనం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండే లక్షణం గల జాతి ప్రజలం. ఈ విధంగా మేము వారిని తమ తోటల నుండీ చెలమల నుండీ ఖజానాల నుండీ మహోన్నతమైన వారి నివాస స్థలాల నుండీ బయటకు తీసుకు వచ్చాము. వారి విషయంలో ఇలా జరిగింది.



మరోవైపు మేము ఇశ్రాయేలు సంతతి వారికి వీటన్నిటికీ వారసులుగా చేసశాము.

తెల్లవారుతుండగా వీరు వారి వెంట పడసాగారు. ఇరుపక్షాల వారు ఒకరికొకరు ఎదురుపడినప్పుడు మూసా సహచరులు: మేము పట్టుబడ్డాము అని కేక వేశారు. అలా ఎంత మాత్రం జరగదు నా ప్రభువు నాతో ఉన్నాడు. తప్పకుండా ఆయన నాకు మార్గం చూపుతాడు అని అన్నాడు. మేము మూసాను నీ చేతి కర్రతో సముద్రాన్ని కొట్టు అని వహీ ద్వారా ఆజ్ఞాపించాము. అప్పుడు హఠాత్తుగా సముద్రం చీలిపోయింది దాని ప్రతిభాగం ఒక మహోన్నతమైన పర్వతం మాదిరిగా నిలబడిపోయింది. ఆ చోటికి మేము రెండో వర్గం వారిని కూడా చేర్చాము. అతనితో ఉన్న వారందరినీ మేము రక్షించాము మిగతా వారిని ముంచి వేశాము.

**నాలుగవ భాగం వచ్చేవారం**

**మొహమ్మద్ అబ్దుల్ రషీద్**
**రచయిత అనువాదకుడు కవి**

# ఓకే బంగారం..(కథ)

ఈరోజు ఎలాగైనా శ్రీమతి విషయంలో ఆ ఒక్క భయాన్ని జయించాలి. ఇదొక్కటే భయంగా మిగలడం ఏమీ బాగోలేదు.పైగా ఒకటా రెండా పాతికేళ్లు గడిచాయి.అలా అని నేనేమీ భార్యా బాధితుడినో, భయస్తుడనో కాను. ఇద్దరి మధ్యా ఏ గొడవలూ లేవు. ప్రస్తుతానికి. భయమే.

ఆమె విషయంలో భయమన్నదే లేదు మొదటి నుంచీ.తను నాకు పరిచయం కావడమే పెళ్లి చూపుల్లో.కొన్ని మాటలయ్యాక మామయ్య అడిగారు ' మీ అభిప్రాయ మేమిటి ' అని. చెప్పాను..తను నచ్చింది.. తనకు కూడా నేను నచ్చితే ఓకే అని. తన అభిప్రాయం చెప్పే ముందు నాతో ఒకసారి మాట్లాడాల్సి ఉందని కబురు పెట్టింది.ఏమై ఉంటుందా అని ఆలోచిస్తూనే వెళ్ళాను.

' నాన్న గారు చెప్పారు మీకు ఈ బంధం కలుపుకోవడం ఇష్టమైందని.నా అభిప్రాయం అడిగారట.సంతోషం.కానీ నా వైపు నుండి వ్యతిరేకత గానీ, వద్దనడానికి కానీ కారణాలేమీ లేవు.ఇంకో ఏడాది చదువు ఉంది.దానిపైనే దృష్టి.నాన్నగారికి మీరు నచ్చడం వల్ల, మిమ్మల్ని వదులుకోవడం ఇష్టం లేక నన్ను ఇప్పటికిప్పుడు పెళ్లి చూపుల్లో కూర్చోబెట్టారు.నా మనసు ఇంకా పెళ్లికి ప్రిపేర్ అయి లేదు.మీ యిష్టం మరి.' అంటూ చేతికి స్ప్రైట్ గ్లాసు అందించింది.


' ఓ స్ప్రైట్ కి వస్తున్న యాడ్ నిజమేనన్న మాట ' గొణిగాను.

గలగలా నవ్వింది.' అంత సూటిగా..సుత్తి లేకుండా చెప్పానా ' అంటూ. మరింత నచ్చింది.నా సెన్స్ ఆఫ్ హ్యూమర్ కి మ్యాచ్ అవుతుందే అని.

' అలాగే.మీ యిష్టం.ఈ సంవత్సరం ప్రేమించుకొని వచ్చే ఏడు పెళ్ళి చేసుకుందాం.' అన్నాను.

'సరే..' అన్నదో లేదో గానీ అన్నట్టే అనిపించింది.

తర్వాత కొన్ని రోజులకు ప్రధానం అయ్యింది.అంత వరకూ చూసుకోవడం కూడా లేదు.తర్వాత మొదటిసారిగా నేనే వాళ్ళ హాస్టల్ కి వెళ్ళాను.అక్కడే అరుగు మీదనే మాట్లాడుకున్నాం.బై చెప్పి వెళ్ళాక వెనక్కి తిరిగి కూడా చూడలేదు.అలా మొదలై..అలా అలా స్పీడ్ పెరిగింది.ప్రతీ రోజూ ఉత్తరాల వరకూ.అప్పుడు సెల్ ఫోన్లు లేవు




మరి.తర్వాత పెళ్లి,పిల్లలు ..చూస్తుండగానే పాతికేళ్లు గడిచాయి.కానీ ..ఆ ఒక్క భయమే ఇదుగో..ఇలా మిగిలిపోయింది.

**** ***** *****

ఉదయం టీ అందిస్తుండగా...' బంగారం..ఒక మాట.' అన్నాను.

ఉలుకు లేదు..పలుకు లేదు.తర్వాత డౌట్ వచ్చింది. పైకి అన్నట్టు లేను...బంగారం తో సహా మాటలన్నీ మింగేసినట్టున్నాను.

మళ్లీ లంచ్ టైం లో అన్నాను ' బంగారం.. ఒక మాట.'

ఈ సారి ' బంగారం ' మాత్రమే మింగినట్టున్నాను.ఒక మాట అన్నది వినబడి ' ఏమిటండీ' అని అడిగింది.

ఏదో చెప్పేశాను కానీ అసలు విషయం చెప్పడానికి మళ్లీ జంకు.ఇక సాయంత్రం వరకూ ప్రిపేర్ అయ్యి సాయంత్రం ఎలాగైనా చెప్పాలి అనుకున్నాను.ఖర్మ. పాతికేళ్లు కాపురం చేస్తూ చెప్పడం వచ్చే సరికి గుండెలో దడ..గొంతు లో మ్యూట్.

దగ్గరకు వచ్చింది. గభాల్న గట్టిగా చెప్పాను ' భంగారం..ఒఖా మ్మాట' ఈ సారి వాల్యూం పెరిగింది కానీ సున్నితం పోయింది గొంతులో.

"ఏమిటండీ.. కంగారు? బంగారం ఏమిటి?పొరపాటున సర్ప్రైజ్ చేద్దామని కొని,తేవడం మర్చిపోయారా. పరవాలేదు లెండి."

"లేదు బంగారం.నిన్ను బంగారం అని పిలవాలని పెళ్లికి ముందు నుండీ ఆశ.అన్ని ఉత్తరాల్లో నిన్ను అలానే సంబోధించే వాడిని కదా.కానీ పిలుపు వరకూ వచ్చే సరికి ఏదో మొహమాటమో,భయమో అడ్డు.మధ్యలో ఒకసారి తీవ్రం గా ప్రయత్నిద్దాం అనుకున్నపుడు ఆ పేరుతో యూ ట్యూబ్ అంతా మీమ్స్.ఇక వాటితో నాకేంటని ఇప్పటికి నోరు పెగులుస్తున్నాను "

వచ్చి ముద్దు పెట్టింది.." మీరు పేరు మెన్షన్ లేకుండా ఇన్నాళ్లూ మాట్లాడినా భావాలేం మారలేదుగా.హాయిగా నచ్చినట్టు పిలవండి. ఉత్తరాల్లో అలా రాయడం ఇష్టమే.ఇలా పిల్చినా ఇష్టమే.మీ యిష్టం.."

" ఓకే..బంగారం." నవ్వాను

" కాకపోతే మీరు ఇలా పిల్చిన ప్రతీ సారీ నాకు కొంటానని ఎగ్గొట్టిన బంగారం మాత్రం గుర్తుకు వస్తుంది."

హమ్మయ్య. భయాన్ని జయించాను.మీకు తెలియదు గానీ భార్య ని ముద్దు పేరుతో హాయిగా పిలవగలిగినట్టు మొహమాటాన్ని జయించడం నాలాంటి మొహమాటస్తులకు చచ్చేంత భయం. పాతికేళ్లు కలిసున్నా తొలిగిపోని భయం.

**సమాప్తం...**

**- డా. డి.వి.జి.శంకర రావు , మాజీ ఎంపీ,**
**పార్వతీపురం. 94408 36931.**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

## వెరైటీ వంటలు

# అవిసె గింజలుం రాగి లడ్డు



కావలసినపదార్థాలు:-
1. అవిసెగింజల పొడి-ఒక కప్పు, 2.రాగి పిండి- ఒక కప్పు, 3.తెల్ల నువ్వులు- రెండు స్పూన్లు, 3.కొబ్బరి తురుము-అరకప్పు, 4.బాదంపప్పు ముక్కలు-అర కప్పు, 5.ఏలకుల పొడి-అర స్పూను, 6.ఎండు ఖర్జూరాలు- నాలుగు, 7.బెల్లం తురుము- ఒక కప్పు, 8.కాచిన పాలు-పావు కప్పు, 9.నెయ్యి-రెండు స్పూన్లు.

తయారు చేయు విధానం:-
స్టవ్ మీద బాండీ పెట్టి అవిసె గింజల పొడిని, రాగి పిండిని, కొబ్బరి తురుముని విడివిడిగా వేగించి తీసి బౌల్లో వేసుకోవాలి. అలాగే బాదంపప్పు ముక్కల్ని, నువ్వుల్ని కూడా వేగించి తీసి రాగి పిండి వేసిన బౌల్ లో వేసుకోవాలి. ఖర్జురపు కాయల్లో గింజలు తీసి చిన్న చిన్న మొక్కలు చేసి మెత్తగా మిక్సీ పట్టి రాగిపిండి మిశ్రమంలో వెయ్యాలి. ఈ మిశ్రమంలో బెల్లం తురుము, కొంచెం నెయ్యి, ఏలకుల పొడి వేసి బాగా కలపాలి. దీనిలో గోరువెచ్చని పాలని ఉండలు చుట్టడానికి సరిపడా పొయ్యాలి. మరొకసారి బాగా కలిపి మనకి కావాల్సిన సైజులో లడ్డూల్లాగా చుట్టి ప్లేట్లో పెట్టుకోవాలి. ఇవి గట్టి పడ్డాక గాలి చేరబడని డబ్బాలో పెట్టుకొని కావలసినప్పుడు సర్వ్ చేసుకోవాలి. మంచి పోషక విలువలతో కూడిన అవిస గింజలుంరాగి పిండి లడ్డు రుచి చాలా అద్భుతంగా ఉండి ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇవి ఇరవై రోజుల వరకు నిల్వ వుంటాయి.

# క్యారెట్-బీట్రూట్ సమోసాలు



కావలసిన పదార్థాలు:-
1. క్యారెట్ తురుము-ఒక కప్పు, 2.బీట్రూట్ తురుము-ఒక కప్పు, 3.కొబ్బరి తురుము- రెండు స్పూన్లు, 4.కర్వేపాకుం కొత్తిమీర తరుగు-రెండు స్పూన్లు, 5.అల్లం పచ్చిమిర్చి తరుగు-రెండు స్పూన్లు, 6.ఉప్పు, నూనె-తగినంత, 7.గోధుమపిండి-ఒకటిన్నర కప్పులు, 8.బొంబాయి రవ్వ- ఒక స్పూను, 9.గోరువెచ్చని పాలు-అరకప్పు, 10.పచ్చి బఠాణీలు-పావు కప్పు.

తయారు చేయు విధానం:-
గోధుమ పిండిని ఒక బౌల్లోకి తీసుకొని తగినన్ని పాలు, ఒక స్పూన్ నూనె, బొంబాయి రవ్వ, కొంచెం ఉప్పు వేసి మృదువుగా వచ్చేలా కలుపుకొని బాల్స్ లాగా చేసి పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద బాండీ పెట్టి రెండు స్పూన్ల నూనె వేసి క్యారెట్, బీట్రూట్, కొబ్బరి తురుములు, పచ్చి బఠానీలు వేసి ఐదు నిమిషాలు వేగించి చివర్లో కరివేపాకు, కొత్తిమీర, తగినంత ఉప్పు, అల్లం, పచ్చిమిర్చి వేసి కలిపి దించి పక్కన పెట్టుకోవాలి.ఇప్పుడు గోధుమ పిండిని చపాతీల్లాగా వత్తా లి. ఈ చపాతీని సమోసా పీట మీద పెట్టి బీట్రూట్ మిశ్రమాన్ని రెండు స్పూన్లు చపాతీపై వేసి సమోసా లాగా వత్తాలి. దీనిని తీసి వెడల్పు ప్లేట్లో పెట్టుకోవాలి. ఇలా అన్ని సమోసాల్ని చేశాక స్టవ్ మీద బాండీ పెట్టి తగినంత నూనె వేసి కాగాక సమోసాల్ని ట్రిప్పుకి మూడు చొప్పున వేసి రెండు వైపులా దోరగా కరకరలాడేలా వేగించి తీసి ముందుగా పేపర్ నాప్కిన్ ప్లేట్లో పెట్టుకుని ఆ తర్వాత సర్వింగ్ ప్లేట్లో పెట్టుకుని సర్వ్ చేసుకోవాలి. క్యారెట్, బీట్రూట్ సమోసాలు మంచి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లో ఉండి రుచి చాలా అద్భుతంగా ఉంటుంది.

# వెరైటీ పునుగులు

కావలసిన పదార్థాలు:-
1. అటుకులు-ఒక కప్పు, 2.గోధుమపిండి-అరకప్పు, 3.ఇడ్లీ పిండి-అరకప్పు, 4.ఉల్లిపాయ ముక్కలు-రెండు కాయలు, 5. కారెట్ తురుము-పావుకప్పు, 6.తెల్ల నువ్వులు-ఒక స్పూను, 7.జీలకర్ర-అర స్పూను, 8.అల్లం-పచ్చిమిర్చి తరుగు- ఒకటిన్నర స్పూన్లు, 9.కలర్ కోసం పసుపు-చిటికెడు, 10.ఉప్పు, నూనె-తగినంత, 11.నీళ్లు-పావు కప్పు.



తయారు చేయు విధానం:-
ఇడ్లీ పిండిలో గోధుమ పిండిని వేయాలి. అటుకుల్ని శుభ్రంగా కడిగి నీళ్లు పిండి ఇడ్లీ పిండి గిన్నెలో వెయ్యాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలపాలి. మరీ గట్టిగా ఉంటే కొంచెంగా నీళ్లు కలపాలి. దీనిని అరగంట నానబెట్టాలి. ఈ పిండి నానాక దీనిలో ఉల్లిపాయ ముక్కలు, కారెట్ తురుము, తెల్ల నువ్వులు, జీరా, అల్లం- పచ్చి మిర్చి, పసుపు, తగినంత ఉప్పు వేసి కలపాలి. స్టవ్ మీద బాండీ పెట్టి తగినంత నూనె పోసి కాగాక ముందుగా రెడీ చేసి పెట్టుకున్న ఇడ్లీ పిండి మిశ్రమాన్ని మీడియం సైజు పునుగుల్లాగా వెయ్యాలి (పిండి మొత్తాన్ని మూడు నాలుగు ట్రిప్పులుగా వేయాలి). రెండు వైపులా దోరగా కాలే వరకు కలుపుతుండాలి. రెండు వైపులా కాలాక తీసి ముందుగా పేపర్ నాప్కిన్ పరచిన ప్లేట్లో పెట్టుకుని ఆ తర్వాత సర్వింగ్ ప్లేట్ లో పెట్టుకొని సర్వ్ చేసుకోవాలి. ఈ వెరైటీ పనుగుల్ని టమాటా చట్నీతో తింటే ఆ రుచి అదరహో.

# మిక్సుడ్ వెజ్ స్వీట్ బాల్స్

కావలసిన పదార్థాలు:-
1. క్యారెట్ తురుము-అరకప్పు, 2.చిలకడదుంపల తరుము-అరకప్పు, 3.కొబ్బరి తురుము- అరకప్పు, 4.సొరకాయ తురుము-అరకప్పు, 5.జీడిపప్పుంబాదం పప్పు -అర కప్పు, 6.ఏలకుల పొడి-అర స్పూను, 7.పటిక బెల్లం తురుము-250 గ్రాములు, 8.తేనె-ఒక స్పూను, 9.బొంబాయి రవ్వ-ఒక కప్పు, 10.నువ్వులు-ఒక స్పూను, 11.కాచిన పాలు-పావు కప్పు, 12.నెయ్యి-మూడు స్పూన్లు. 13. ఎండు ద్రాక్ష- 25

తయారు చేయు విధానం:-
స్టవ్ మీద బాండీ పెట్టి బొంబాయి రవ్వ వేసి దోరగా వేగాక తీసి వెడల్పు గిన్నెలోకి తీసుకోవాలి. మరల స్టవ్ మీద బాండీ పెట్టి కొంచెం నెయ్యి, క్యారెట్, చిలకడదుంప, సొరకాయ, కొబ్బరి తురుములు వేసి వేగించాలి. ఈ తురుములు మూడు వంతులు వేగాక నువ్వులు, ఏలకుల పొడి వేసి మరికొద్ది సేపు వేగించి తీసి



బొంబాయి రవ్వలో కలపాలి. అలాగే జీడిపప్పు, బాదాంపప్పు, ద్రాక్ష ని కూడా బాండీలో వేసి ఒక స్పూను నెయ్యి వేసి దొరగా వేగించి తీసి బొంబాయి రవ్వ మిశ్రమంలో వెయ్యాలి. ఈ మిశ్రమంలో పటిక బెల్లం తురుము, తేనే వేసి కలపాలి. ఈ మిక్సుడు వెజ్ మిశ్రమం బాల్స్ లాగా రావడానికి సరిపడా గోరువెచ్చని పాలు పోసి మిశ్రమాన్ని బాగా కలపాలి. ఇప్పుడు దీనిని మీడియం సైజు బాల్స్ లాగా చేసి వెడల్పు ప్లేట్లో పెట్టాలి. ఈ బాల్స్ గట్టిపడ్డాక తీసి గాలి చేరబడి డబ్బాలో పెట్టుకొని నిల్వ చేసుకోవాలి. చక్కని హెల్దీ ఇంగ్రిడియన్స్ తో తయారైన ఈ మిక్సుడు వెజ్ బాల్స్ రుచి చాలా అద్భుతంగా ఉండి అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.



పింగళి భాగ్యలక్ష్మి
9704725609

# మాలధారణం నియమాల తోరణం



**హిందూ పంచాంగం ప్రకారం, కార్తీక మాసం నుంచి మకర సంక్రాంతి వరకూ శబరిగిరుల్లో శివకేశవుల కుమారుడు శ్రీ మణికంఠుడిని అయ్యప్ప మాల ధరించి దర్శించుకుంటారు. 41 రోజుల పాటు కఠినమైన నియమ నిష్టలు, భక్తి శ్రద్ధలతో అయ్యప్ప దీక్షను కొనసాగిస్తారు. దీక్షలో భాగంగా కటిక నేలమీద పడుకోవడం, 41 రోజుల పాటు చల్లని నీళ్లతో స్నానం, పాదరక్షలు వేసుకోకపోవడం, నల్లని దుస్తులను మాత్రమే ధరించడం, ఏక భుక్తం వంటి కఠిన నిబంధనలను పాటిస్తారు. అయితే ఇలా అయ్యప్పమాలను ఎందుకు వేసుకుంటారు.. మణికంఠుడి మాలను ధరిస్తే కలిగే ప్రయోజనాలేంటి.. మాల వేసిన వారిని స్వామి అని ఎందుకు పిలుస్తారనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం...**

పూర్వకాలంలో మహీషి అనే రాక్షసి బోళా శంకరుడి వరం పొంది ప్రజలను ఇంద్రాది దేవతలను సైతం హింసించేది. తనకు ఆడ,మగ కలయికతో పుట్టిన వారితో గానీ, విల్లుతో గానీ, ఆయుధాలతో గానీ మరణం ఉండకుండా వరం పొందింది. ఆ తర్వాత ఇంద్రాది లోకాలకు వెళ్లి వికృత చేష్టలకు దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. మహీషి చేష్టలకు భయాందోళన చెందిన దేవతలు మహా విష్ణువును శరణు కోరతారు. దీంతో ఆయన మోహినీ అవతారమెత్తి పరమ శివుడిని మోహిస్తాడు. వీరద్దరి కలయికతో అయ్యప్ప జన్మిస్తాడు. మణిమాలతో కేరళ రాజ్యంలోని అటవీ ప్రాంతంలో పాండ్యరాజులకు దొరుకుతాడు. మణిమాలతో దొరికిన ఆ శిశువుకు మణికంఠుడు అని నామకరణం చేస్తారు. మణికంఠుడు మహీషిని వధించి దేవతలు, మునుల పూజలందుకుంటాడు. అనేక మహిమలతో పాండ్య రాజులకు, ప్రజలకు దగ్గరవుతాడు. ఆ శివకేశవుల తనయుడైన శ్రీమణికంఠుని మాలధారణ నియమాలతో కూడుకున్న ఆచరణ. హరిహరపుత్రుడైన అయ్యప్ప కొలువై ఉన్న కేరళ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో వేలమంది అయ్యప్ప దీక్ష తీసుకుని మాల ధరిస్తున్నారు. శరీరాన్ని, మనసును చెడు నుంచి మంచి మార్గంలోకి మళ్లించే దీక్షే స్వామి శరణమయ్యప్ప మండల దీక్ష. మోక్షమార్గాన్ని అన్వేశించే వారు, సన్మార్గాన జీవనయాత్ర సాగించాలనుకునేవారు తప్పని సరిగా జీవితంలో ఒక సారి అయినా శబరిమల యాత్ర చేయాలని ఉవ్విళ్లూరు తుంటారు.

## మణిమాలతో దీక్ష ప్రారంభం..

మన పూజా విధానంలొ జపమాలగా ఉన్నత స్థానాన్ని పొందిన కంఠాభరణాలు తులసి, రుద్రాక్ష, చందనం, స్పటికం, పగడాలు తామర పూసల మాలలు. రుద్రాక్షలు అనేవి అ పరమేశ్వరుడు ఐన శివుని అంశ వలన ఉద్భవించినవిగా ప్రతీక. అందువలన రుద్రాక్షల మాలలు అన్నింటిలొ శ్రేష్టమైనవిగా చెప్పుకుంటాము. రుద్రాక్షల వలన రుద్రాక్షలు ధరించటం వలన మనకు చాలా మంచి ఫలితాలు అనగా భూత పిశాచ భాధలు తొలుగుతాయి అంతేకాక మన ఆరోగ్యానికి కూడా ఎంతొ మంచిది. రుద్రాక్ష అధిక కొపాన్ని తగ్గించి బి.పిని కంట్రోల్ చేస్తుంది ఏన్నో ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. తులసి మాల విష్ణుమూర్తికి ప్రతీక. ఈ మాల ధరించటం వలన శరీరంలో వేడి తగ్గుతుంది. చందన మాల శరీరానికి తాపనివారిణిగా పనిచేస్తుంది. స్పటికమాల మాలిన్యాలను గ్రహిస్తుంది. పగడమాల వలన రక్తప్రసరణ బాగా జరుగుతుంది. తామర పూసల మాల చర్మ వ్యాధులను దరిచేరనివ్వదు. అందుకే ఈ పరమ పవిత్రమైన మాలలకు పూజ, అభిషేకం చేసి, ఆ మాలల యందు అ అయ్యప్ప స్వామిని ఆవహింపచేసి వాటిని ధరించి భక్తులు అందరూ శుద్ధిగా దీక్ష తీసుకుంటారు.

అయ్యప్ప స్వామి దీక్షను మణిమాలతో ప్రారంభిస్తారు. ఈ దీక్షను మండల కాలం(41 రోజులు) పాటు కొనసాగిస్తారు. ఈ దీక్షలో ఉండే వారు రుద్రాక్ష, తులసి, చందనం, స్పటికం, పగడాలు, తామర పూసల మాలల ధరిస్తారు. ఇవి శారీరక, మానసిక ఆరోగ్యాన్నిస్తాయి. ఈ మండల కాలంలో ఏదైనా దీక్ష చేపడితే అదంతా మిగిలిన జీవితానికి ఆదర్శం. శబరిమలలోని 18 మెట్లను ఎక్కి మణికంఠ స్వామి వారిని దర్శించుకోవడం ఈ దీక్ష ముగుస్తుంది. **(మిగతా 8వ పేజీలో)**



(7వ పేజీతరువాయి)

ఈ కాలంలో ఎలాంటి హంగు, ఆర్భాటాలు, లేకుండా సామాన్య జీవన గడపడం అలవడుతుంది.





### నియమాలు ఇలా..

అయ్యప్ప మాలను పవిత్రమైన ఆలయంలో గురుస్వామి వద్ద కానీ లేదా ఇంట్లో మాతృమూర్తి వద్ద వేయించుకోవచ్చును. ప్రతి రోజు సూర్యోదయంకు ముందే పూజలు, సూర్యాస్తమయం తరువాత పూజలు నిర్వహించాలి. కఠిన నియమాలను పాటిస్తూ నలుపు దుస్తులనే వాడాలి. రాత్రివేళల్లో ఆలయాలలోని నిద్రే శ్రేయస్కరం. ప్రతి రోజు ఏదో ఒక గుడిని దర్శించడం ఆనవాయితీగా చేపట్టాలి.

### నల్లని దుస్తులే ఎందుకంటే..

అయ్యప్ప స్వామి దీక్షలో ఉండేవారంతా నల్లని దుస్తులను ధరిస్తారు. ఎందుకంటే శని దేవుడికి నల్లని రంగు అంటే మక్కువ. ఆ రంగు బట్టలను ధరించి నిత్యం పూజల్లో పాల్గొనే వారిపై శని ప్రభావం ఏ మాత్రం ఉండదని చాలా మంది నమ్ముతారు. అంతేకాదు చలికాలంలోనే అయ్యప్పమాలను ధరిస్తారు. ఈ సమయంలో నల్లని దుస్తులు శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తాయి. ఈ దీక్ష చేపట్టిన వెంటనే మానవుడు మాధవుడిగా పరివర్తనం చెందడం ప్రారంభిస్తాడు.



### 'స్వామి' అనే నిబంధన..

అయ్యప్ప మాలను ధరించిన వెంటనే ప్రతి ఒక్కరిలోనూ నేను అన్న భావన తొలగిపోతుంది. శరీరానికి ఉండే పేరు, వాటి కోసం ధరించే దుస్తులు, తీసుకునే ఆహారం, శారీరక సౌఖ్యాలు, ఆచార వ్యవహారాలు, దినచర్య అంతా ఒకే ఒక చేపట్టగానే పూర్తిగా మారిపోతాయి. అందుకే అయ్యప్ప మాలను ధరించిన వ్యక్తిని అంతర్థానంలో భగవంతుడి స్వరూపంగా జీవులందరిలోనూ దేవుడు ఉన్నాడనే భావనతో 'స్వామి' అని పిలవాలని అయ్యప్ప దీక్షలో ఈ నిబంధనను విధించారు.


### ఎప్పుడు మాల వేయకూడదు..

హిందూ ఆచారాల ప్రకారం, సాధారణంగా కార్తీక మాసం నుంచి మకర సంక్రాంతి మధ్యలో 41 రోజుల పాటు అయ్యప్ప మాలను ధరిస్తారు. అయితే తల్లిదండ్రులలో ఎవరు మరణించినా వారు కనీసం సంవత్సరం పాటు మాలను వేసుకోకూడదు. అలాగే భార్య మరణించిన తర్వాత ఆరు నెలల వరకు అయ్యప్ప దీక్షకు దూరంగా ఉండాలి.

### భక్తుడే భగవంతుడు

అయ్యప్ప దీక్ష చేపట్టగానే నేను అన్న భావన నశించిపోతుంది. దేహానికి ఉన్న పేరు, దేహం ధరించే దుస్తులు, తినే ఆహారం, శారీరక సౌఖ్యాలు, ఆచార వ్యవహారాలు, దినచర్య అన్నీ ఒకే ఒక దీక్షతో మారిపోతాయి. అందుకే దీక్ష చేపట్టగానే ఆ వ్యక్తి పేరు అంతర్థానమై స్వామి గానే పిలువబడుతుంటారు. దీక్ష చేపట్టిన వెంటనే మానవుడు మాధవుడిగా పరివర్తన చెందడం మొదలవుతుంది. ఈ పరిణామక్రమం పూర్తి అయితే అప్పుడు భక్తునికి, భగవంతునికి తేడా కనిపించదు. ఈ సత్యాన్ని చాటిచెప్పడానికే అయ్యప్పదీక్ష ప్రారంభమైంది. కులమత భేదాలు, తారతమ్యాలు లేని ఓ ఆధ్యాత్మిక ప్రపంచమే శబరిమల.





### ఇరుముడి ప్రాముఖ్యత

అయ్యప్పను నవవిధ సేవలతో ప్రార్థిస్తుంటారు. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, నమస్కారం, ధ్యానం, స్మృతం, ఆత్మ నివేదనలతో అయ్యప్పను కొలుస్తుంటారు. అయ్యప్ప దీక్షలో ఇరుముడికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇందులో రెండు ముడులు ఉంటాయి. ముందున్న ముడిలో స్వామి అయ్యప్ప స్వరూపమైన ముద్ర, కొబ్బరికాయ, స్వామి వారికి సమర్పించే వస్తువులను ఉంచుతారు. కొబ్బరికాయను నేతితో నింపుతారు. ఈ నెయ్యి జ్ఞానానికి ప్రతీకగా చెబుతారు. కొబ్బరికాయకు బిగించే కార్క్‌ను వైరాగ్యానికి చిహ్నంగా భావించి మూతపెడతారు. ఆ పైన కాయకు ఆత్మ అనే లక్కతో సీలు వేస్తారు. ఈ జ్ఞానం అనే నెయ్యితోనే స్వామి అయ్యప్పకు అభిషేకం చేస్తారు. మనలోని జ్ఞానాన్ని సంపూర్ణంగా స్వామి అయ్యప్పకు నిండు మనస్సుతో అర్పించుకున్నట్లుగా భావించడమే అర్థం. దీన్నే ఆత్మ నివేదన అంటారు. స్వామి అయ్యప్ప దీక్షలో పరమార్థం కూడా ఇదే. నేను అనే అహంభావంతో ఉన్న దేహం నుంచి జ్ఞానాన్ని వేరు చేసి దాన్ని అయ్యప్పకు కైంకర్యం చేయడంతో దేహంలోని అనేకానేక సందేహాలు పటాపంచలైపోతాయి. ఓ దివ్య జ్యోతి దర్శనమవుతుంది. దానినే మకరజ్యోతిగా భావించాలి.


### ఆద్యంతం భక్తిపారవశ్యమే..

శబరిమలై యాత్ర ఆద్యంతం భక్తి పారవశ్యమే. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయం నుంచి ఇరుముడి కట్టుకుని బృందంతో బయలుదేరుతారు. మొదటగా వావర్‌స్వామి కొలువై ఉన్న ఎరిమేలికి చేరుకుంటారు. అక్కడ పేటతుళ్లి ఆడి వావర్‌స్వామిని, పేటశాస్త్రిలను దర్శించుకుని పంబకు బయలుదేరుతారు. పంబానదిలో పుణ్యస్నానాన్ని ఆచరించి సన్నిధానంకు ఇరుముడిని మోసుకుంటూ స్వామియే శరణమయ్యప్ప అంటూ బయలుదేరుతారు. కొండ అంచున ఉన్న అప్పాచిమేడు చేరుకుంటారు. అక్కడి నుంచి కొంత దూరం ప్రయాణిస్తే బహిరంగ ప్రదేశంలో శబరిపీఠం కనిపిస్తుంది. పంబానదికి సన్నిధానానికి మధ్య ఉన్న శరంగుత్తిఆల్‌కు చేరుకుంటారు. అక్కడ కన్నెస్వాములు శరంపుల్లలను ఉంచుతారు. అనంతరం స్వామి వారిని సన్నిధానానికి చేరుకుంటారు.

### పవిత్రమైన పదునెట్టాంబడి..

స్వామి సన్నిధానంలో ఉండే 18 పడిమెట్లను అవతార పురుషుడైన పరుశురాముడు నిర్మించాడని చెప్పుకుంటారు. అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరుతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశాన్యుడు, రెండు యోగములైన కర్మయోగం, జ్ఞానయోగంతో పాటు విద్య, అవిద్య, జ్ఞానం, అజ్ఞానానికి రూపాలుగా ఈ 18 మెట్లను ఏర్పరిచారు. సన్నిధానం చేరిన భక్తులు 18 మెట్లు ఎక్కే ముందు కొబ్బరికాయను కొట్టి ఎక్కవలెను. స్వామి వారి దర్శనార్థం ఇరుముడిని గురుస్వామి సాయంతో విప్పవలెను. అందులో ఉన్న నెయ్యిని అయ్యప్పకు అభిషేకాన్ని చేస్తారు. అనంతరం మాలిగైపుత్రమ్మ వారి సన్నిధికి చేరుకుని ఆమె చుట్టూ కొబ్బరికాయలను దొర్లించి పసుపు, జాకెట్ ముక్కలను ఆమెకు మొక్కుగా చెల్లించుకుంటారు.

(మిగతా 9వ పేజీలో)




( 8వ పేజీ తరువాయి)

## అయ్యప్ప దీక్షతో ఆరోగ్య ప్రయోజనాలు..

అయ్యప్ప దీక్షలో ఉండే వారు నేలపై నిద్రించడం వల్ల వెన్నునొప్పి సమస్యలు తొలగిపోతాయి. కండరాల బలపడేందుకు దోహదపడుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. తెల్లవారుజామునే నిద్ర లేచి చల్లని స్నానం చేయడం వల్ల శరీరంలోని నాడీ వ్యవస్థ ఉత్తేజంగా మారుతుంది. ప్రతిరోజూ దుస్తులను తడిపి శుభ్రం చేసుకోవడం అలవాటుగా మారుతుంది. క్రమం తప్పకుండా స్వామి పూజలో పాల్గొనడం వల్ల సంఘజీవనానికి బాటలు వేస్తుంది. దీపారాధన చేయడం వల్ల ఆధ్యాత్మికతపై ఆసక్తి పెరుగుతుంది. శాకాహారమే తీసుకోవడం వల్ల ఆరోగ్య పరంగా ప్రయోజనకరంగా ఉంటుంది.

కలియుగంలో ప్రత్యక్షదైవం తిరుమలవెంకటేశ్వరస్వామి తరువాత అంతటి ప్రాచుర్యం పొందిన దైవం అయ్యప్పస్వామి. అయ్యప్ప దీక్షలోని కఠోర నియమాలు, చిత్తశుద్ధి, గురుభక్తి, ఆత్మనివేదన ఈ దీక్షలోని ప్రత్యేకతలు.

మండల కాలం (41రోజులు) ఈ దీక్ష కొనసాగుతుంది. 18 మెట్లను ఎక్కి స్వామి వారిని దర్శించుకోవడంతో దీక్ష ముగుస్తుంది. కఠోర దీక్ష ముగియగానే కలిగే మానసిక ఆనందం అంతా ఇంతా కాదు. మళ్లీ ఎప్పుడు దీక్ష చేపడదామా, మళ్లీ అయ్యప్పను కనులారా చూస్తామా అంటూ పరితపిస్తుంటారు భక్తులు. ఈ యేడాది నవంబర్ 16 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 3వ తేది వరకు మండల దర్శనం, జనవరి 10 నుంచి మకర సంక్రాంతి వరకు మకరజ్యోతి దర్శనంగా పరిగణిస్తారు.



అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయి. ఇవి కామం, క్రోధం, లోభ, మోహ, మద, మత్సర్యాలైయిన అరిషడ్వర్గాలని ప్రతీతి. మనిషిలోని 18 రకాల చెడు గుణాలు తొలగిపోవడానికి దీక్షలో పడిపూజ (మెట్టు పూజ) నిర్వహిస్తారు. అయ్యప్ప మాల ధరించిన ప్రతిసారి చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి వారిగా మారాలని కోరుకుంట్ఝూ ఈ పూజను నిర్వహిస్తారని గురుస్వాములు చెబుతారు



# నియమాల తోరణం

మాలధారణ చేసిన స్వాములు 41 రోజులపాటు అత్యంత నియమ నిష్టలతో అయ్యప్పను పూజిస్తారు.

ఉభయ సంధ్యల్లో చన్నీళ్లతో శిరస్నానం ఆచరించి స్వామికి దీపారాధన చేసి, స్తోత్రపఠం చేయాలి.

దేవతార్చన జరిపి, మధ్యాహ్నం బిక్ష, రాత్రికి అల్పాహారం తీసుకోవాలి.

నల్లని దుస్తులు ధరించాలి, రోజూ దేవాలయాన్ని దర్శించాలి, పాదరక్షలు ధరించరాదు.

దీక్ష కాలంలో క్షవరం చేయించుకోవడం, గోళ్లను కత్తిరించకోవడం చేయరాదు.

మెడలో ధరించిన ముద్రమాలను ఎట్టిపరిస్థితిలోనూ తీయరాదు. అయ్యప్ప సన్నిధానానికి చేరడానికి కనీసం 41 రోజులు ముందు దీక్ష ఆరంభించాలి.

అస్కలిత బ్రహ్మచర్యం పాటించి, యోగిగా జీవించాలి. ఇంటికి దూరంగా ఉండటం శ్రేయస్కరం.

దాంపత్యజీవితం, మనోవాక్కాయ కర్మలను తలచుట కూడా అపరాధం.

పరుపులు, దిండ్లు ఉపయోగించరాదు. నేల మీద కొత్త చాప పరచుకొని శయనించాలి.

శవం, బహిష్టు అయిన మహిళల చూడరాదు. ఒకవేళ అలా చూసిన యెడల పంచగవ్య శిరస్నానం చేసి, శరణుఘోష చెప్పినంత వరకు మంచి నీళ్లైనా ముట్టుకోరాదు.

దీక్షా కాలంలో స్వామియే శరణమయ్యప్ప అనే మూల మంత్రాన్ని జపించాలి. మాలధారణలో ఉన్నప్పుడు స్త్రీలను భార్యతోసహా దేవతామూర్తులుగా భావించాలి.

పేరు చివర అయ్యప్ప అని పదం చేర్చాలి. ఇతరులను అయ్యప్పా లేదా స్వామి అని పిలవాలి. మహిళను మాతా అని సంభోదించాలి.

ఎవరైనా భిక్షకు పిలిస్తే తిరస్కరించరాదు.

నుదుటిపై ఎల్లప్పుడూ విభూధి, చందనం, కుంకుమ ధరించాలి.

మద్యం సేవించడం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. తాంబూలం కూడా నిషిద్ధమే.

సాత్వికాహారాన్ని తీసుకోవాలి. రాత్రిపూట అల్పాహారం. స్వామి శరణు ఘోష ప్రియుడు కాబట్టి నిరంతరం భజనల్లో పాల్గొనాలి.

హింసాత్మక చర్యలకు దూరంగా వుండాలి. అబద్ధమాడటం, దూషణ చేయరాదు. అధిక ప్రసంగాల దూరంగా ఉండాలి.

తల్లిదండ్రులకు కూడా పాదాభివందనం చేయవచ్చు. దీక్షలేని ఇతరులకు పాదాభివందనం చేయరాదు.

స్వామికి అర్చన చేసిన తర్వాత ఇష్టదైవాన్ని ధ్యానించాలి. అష్టరాగాలు, పంచేంద్రియాలు, త్రిగుణాలు, విద్య, అవిద్యలకు దూరంగా ఉండాలి.

దీక్షా సమయంలో తమ శక్తిమేరకు కనీసం ఒకసారైనా అయ్యప్పలకు భిక్ష పెట్టాలి. స్వామి కర్పూరం ప్రియుడు, ఉభయ సంధ్యల్లో కర్పూర హారతి ఇవ్వాలి.

దీక్షా సమయంలో వయస్సు, హోదా, అంతస్తు మరచి సాటి అయ్యప్పలకు పాదాభివందనం చేయడానికి వెనుకాడరాద

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 05.11.2023 నుంచి 11.11.2023 వరకు

## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము



వారం ప్రారంభంలో వ్యవసాయ అంశాలు, విద్యార్థుల విద్య అంశాలలో శ్రద్ధ తీసుకుంటారు. తల్లి ఆరోగ్యం బాగుంటుంది. పెట్టుబడులు పెట్టేటప్పుడు, రుణములు ఇచ్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. గృహ వాతావరణం సందడిగా ఉంటుంది. నూతన గృహ, ఖరీదైన వాహన కొనుగోలు కొరకు ఆలోచనలు చేస్తారు. వాహనములు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వృత్తిపరంగా బాధ్యతలు అధికము, అలసట బడలిగా ఉంటాయి. వృత్తి సంబంధ అంశాలలో ఇతరుల సలహాలు, కొత్త వ్యక్తుల జోక్యం కొంత చికాకును కలిగిస్తుంది. వారం మధ్యలో శారీరక శ్రద్ధ పెరుగుతుంది. ఆరోగ్యం ఇంతకు ముందు కన్నా కొంతవరకు మెరుగుపడుతుంది. మనసు ఉల్లాసంగా ఉంటుంది, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు,

## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు



వారం ప్రారంభంలో ధైర్యం పరాక్రమం పెరుగుతుంది స్నేహితులు సహకరిస్తారు నూతన వ్యక్తుల పరిచయాలు, దూర ప్రాంతాలలో ఉండే మిత్రుల, తోబుట్టువుల తో దీర్ఘకాలిక చర్చలు, సలహాలు కొత్త నిర్ణయాలు. కమ్యూనికేషన్ బాగుంటుంది , జర్నలిజం రంగంలో ఉండే వారికి అనుకూలంగా ఉంటుంది స్థిరాస్తుల విషయాలలో, దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన అంశాలలో త్వరపడి నిర్ణయాలు తీసుకుని తద్వారా ఇబ్బందులకు గురి కాకుండా ముందు జాగ్రత్త తీసుకొని ముఖ్యులను సంప్రదించి ముందుకు వెళ్లడం అన్ని విధాల శ్రేయస్కరం .దూర ప్రదేశాలలో హాస్టల్లో వసతి కొరకు ప్రయత్నాలు చేయు విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. గృహ మార్పులకు, చిన్నపాటి రిపేరులకు అవకాశాలు.

## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు



ఎడబాటు, పౌరుషంగా నిర్ణయాలు తీసుకుంటారు. నూతన పెట్టుబడుల విషయాల్లో కొత్తవారిని త్వరపడి నమ్మి నిర్ణయానికి రాకూడదు. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ వాటిని చాకచక్యంగా నియంత్రించుకోవాలి. వారం మధ్యలో ఇతరులకు సలహాలు ఇస్తారు.నిర్ణయ సామర్థ్యం బాగుంటుంది కొత్త ఆలోచనలు చేస్తారు ప్రణాళికా పరంగా ముందుకు వెళతారు. సంతాన సహకారం బాగుంటుంది. విదేశీ ప్రయాణాల కొరకు ఆలోచనలు చేస్తారు. సమిష్టి సమావేశాలలో పాలుపంచుకుంటారు. వారం చివరిలో సంతానం అభివృద్ధి మీకు గౌరవాన్ని పెంచుతుంది. ఆలోచనలు వికసిస్తాయి. విద్యాపరంగా కొత్త విషయాలు తెలుసుకుంటారు. వృత్తిపరమైన అభివృద్ధి , ఆదాయము ఆనందాన్నిస్తుంది.

## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు



వారం ప్రారంభంలో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు, విద్యాపరమైన అభివృద్ధి విషయాలలో ముందుకు వెళతారు. మీరు ఉత్సాహంగా కొంత ఉద్వేగంగా ఉంటారు. సంతానమునకు విద్యాసంబంధమైన స్టేషనరీ మొదలైన ఖర్చుల కొరకు ధనాన్ని ఏర్పరచుకుంటారు. పరిచయము లేని కొత్త వ్యక్తులను నమ్మే విషయంలో ముందు జాగ్రత్త అవసరం. భాగస్వామి సహకారంతో వృత్తిపరమైన అభివృద్ధి కొరకు చేయు ప్రయత్నాలు ముందుకు సాగుతాయిపెద్దలతో కలిసి ఆధ్యాత్మిక క్షేత్ర సందర్శన కొరకు చేయు ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. పోటీలలో విజయం సాధించడానికి చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి ఆత్మీయుల తోడ్పాటుతో అనుకున్న విషయాలలో విజయాన్ని సాధిస్తారు వారం మధ్యలో.ఇతరులకు వాగ్దానాలు చేసేటప్పుడు ఆలోచించి చేయడం మంచిది

## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము



వారం ప్రారంభం రుణములు చెల్లించటానికి చేయు ప్రయత్నాలు కొంతవరకు సత్ఫలితాలను ఇస్తాయి. దీర్ఘకాలంగా ఇబ్బంది పెడుతున్న ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకుంటారు. అధిక ఖర్చులతో ప్రారంభమైనప్పటికీ అవి సంతృప్తికరంగా సద్వినియోగ పడతాయి మీ సహకారం కోరుకున్న మిత్రులకు సమయానికి మీరు ఉపయోగకరంగా ఉంటారు. విదేశాలలో ఉన్న చిన్ననాటి స్నేహితులను ఫోన్ల ద్వారా పలుకరిస్తారు. వారం మధ్యలో జర్నలిజం మరియు కళా రంగంలో ఉండే వారికి కవులకు అనుకూలమైన సమయం. భాగస్వామి వృత్తి పరంగా నూతన అవకాశాలు, శారీరక శ్రద్ధ పెరగడం జరుగుతుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. దూర ప్రాంత ప్రయాణాలు. వారము చివరిలో మానసిక సంఘర్షణ అధికంగా ఉంటుంది.

## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు



వారం ప్రారంభం ఎంత కాలంగానో ఎదురుచూస్తున్న ఒక వార్త సంతోషాన్నిస్తుంది.స్థిరాస్తులకు సంబంధించిన విషయాలలో కొత్త ఆలోచనలు చేస్తారు.కుటుంబ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.విదేశాలలో గుర్తింపు గౌరవం లభిస్తుంది. దూరప్రాంతాల్లో ఉన్న వ్యక్తుల సహకారముతో భాగస్వామికి నూతన అవకాశాలు లభిస్తాయి. ఆర్థికంగా బాగుంటుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది వృత్తిపరమైన అభివృద్ధి. వారం మధ్యలో ఆకస్మిక ఖర్చులు ప్రయాణాలు ఉన్నప్పటికీ కుటుంబ వ్యక్తుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. వారము చివరిలోసాంఘిక సేవ చేస్తారు. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో నూతన పరిచయాలు. భాగస్వామి ఆదాయపరంగా బావుంటుంది. భూ సంబంధ కొనుగోలు కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు.

## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు



వారం ప్రారంభంలో ఆగిన పనులు ముందుకు వెళతాయి. వృత్తిపరమైన నూతన అవకాశాలు. విదేశీ వ్యక్తుల నుంచి అనుకోని ఆహ్వానాలు. ఆకస్మికంగా ఆదాయం పెరుగుదల. భూ వాహన కొనుగోలు కొరకు నూతన ప్రయత్నాలు. వారం మధ్యలోసంతాన పరంగా ఒక గుర్తింపు ఆనందాన్ని కలిగిస్తుంది. పాత స్నేహితులని, ఆత్మీయులైన వ్యక్తులని కలుస్తారు. వారి సహకారంతో నూతన ప్రణాళికకి నాంది పలుకుతారు. కొంతకాలంగా ఇబ్బంది పెడుతున్న ఆరోగ్యము మెరుగు పడుతుంది. ఎదురుచూస్తున్న సమాచారాలు అందుకుంటారు, సంఘంలో రివార్డులు, అవార్డులు ఆనందాన్ని కలిగిస్తాయి. చాలా కాలంగా పడుతున్న శ్రమకి తగిన గుర్తింపు గౌరవం కళా రంగంలో ఉండే వారికి నూతన అవకాశాలు.

## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు



వారం ప్రారంభంలోవిదేశాలలో ఉండే మిత్రుల సహకారంతో సంతాన వృత్తిపరమైన కొత్త నిర్ణయాలు. ఆధ్యాత్మికమైన ప్రయాణాలు దైవదర్శనాలు, ఆలయ సందర్శన.గృహ వాతావరణం కొంచెం ఘర్షణాత్మకంగా ఉన్నప్పటికీ సమయస్ఫూర్తిగా మాట్లాడి సమస్యల్ని అధిగమిస్తారు. ఏది ఏమైనప్పటికీ ఒకరితో ఒకరికి అపార్థాలు రాకుండా కుటుంబసభ్యులు మధ్య సమన్వయం పాటించాలి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విదేశీ ప్రయాణ అవకాశాలు. ఉన్నత విద్య కొరకు విద్యార్థులకు దూర ప్రాంతాలలో వ్యక్తుల సహకారం. నూతన విషయాలు తెలుసుకుంటారు. విద్యార్థులకు విద్యాపరమైన అంశాల్లో శ్రద్ధ ముఖ్యము జ్ఞాపక శక్తిని పెంచుకోవాలి. వృత్తిపరమైన బాధ్యతలు అధికంగా ఉంటాయి. సమయానికి తగిన ఆహార స్వీకరణ, విశ్రాంతి అవసరము.

## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాడ 1వ పాదము



ఈ రాశి వారికి వారం ప్రారంభంలో ఆరోగ్య విషయంపై శ్రద్ధ తీసుకోవాలి. అవసరమైతే అశ్రద్ధ చేయకుండా వైద్యులన్నీ సంప్రదించాలి. ముఖ్య పనులు, ప్రయాణాలు , రావలసిన ఆదాయము వాయిదా, అనుకోని విమర్శలకు అవకాశాలు అధికంగా ఉన్నప్పటికీ వీలైనంతవరకు కొత్త వ్యక్తులతో ఆచితూచి మాట్లాడడం మంచిది. వారం మధ్యలో ఇబ్బంది పెట్టాలని చూసే శత్రువులపై విజయాన్ని సాధించే ప్రయత్నం చేస్తారు. దూర ప్రయాణాలకు అవకాశం. విదేశాలకు ప్రయత్నం చేయు విద్యార్థులకు కొంత అనుకూలం.ఆత్మీయులు సహకరిస్తారు, ఆగిన పనులు కొంత వరకు ముందుకు వెళతాయి కమ్యూనికేషన్, ధైర్యం నిర్ణయ సామర్థ్యం పెరుగుతుంది. ఆధ్యాత్మికమైన ఉన్నత వ్యక్తులని దర్శిస్తారు.వారం చివరిలోవృత్తిపరమైన అభివృద్ధి, ఆదాయంలో పెరుగుదల

## మకర రాశి

ఉత్తరషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు



ప్రారంభంలో పోటీలలో విజయం సాధించే ప్రయత్నాలలో అధికంగా శ్రమ పడతారు. వృత్తిపరంగా విదేశీ వ్యక్తులతో సమావేశాలు చర్చలు. తోబుట్టువుల సహకారం ఆశిస్తారు. సాంఘికంగా సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తులని కలుస్తారు. మనసు ప్రశాంతత తక్కువగా ఉంటుంది. ఏ విషయంలోనూ సరైన నిర్ణయానికి రాలేక కొంత ఆలోచన మందగిస్తుంద. నూతన పరిచయాలతో వ్యాపార అంశాలపై దృష్టి సారిస్తారు. వారం మధ్యలో ముఖ్యమైన పనులలో కొంత ఆటంకాలు వాయిదాలు, ప్రయాణాలు. ఆరోగ్య విషయంలో కొంత చికాకులు. కృషికి తగిన ఫలితం లభించడం లేదని కొంత నిరాశ. రావలసిన ఆదాయము సమయానికి రాకపోవడం వల్ల ఇబ్బంది, అయినప్పటికీ నిలవ ధనములతో సాగిస్తారు.

## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు



వారం ప్రారంభంలో ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకుంటారు. పోటీలలో శత్రువులపై విజయం సాధిస్తారు.శత్రుత్వంతో ఉన్న వ్యక్తులు మీకు ప్రస్తుతం మిత్రులు అయ్యే అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులకు విదేశీ విద్య దూర ప్రయాణాలు చేస్తారు. కుటుంబ వాతావరణ ఆహ్లాదకరంగా ఉంటుంది విందు విలాసాల్లో పాల్గొంటారు. సంతానమునకు అభివృద్ధి కరంగా ఉంటుంది విదేశీ అవకాశాలు ఆహ్వానాలు.చాలా కాలంగా వాయిదా పడుతున్న వస్తున్న విషయాలలో కొంచెం కదలిక. ఆరోగ్యం బాగుంటుంది భూమి సిరాస్తుల అంశాలలో అనుకూలంగా ఉంటుంది. రావలసిన రుణములు వారం మధ్యలోపలుకుబడి కలిగిన వ్యక్తులతో సమావేశాలు చర్చలు, భాగస్వామి వృత్తిపరమైన అభివృద్ధి కొరకు ప్రయత్నాలు చేస్తారు. సంఘాల్లో గౌరవం, గుర్తింపు.

## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు



వారం ప్రారంభంలోవిద్యార్థులు విద్యాపరమైన అంశాలలో దృష్టి సారించాలి. అనుకోని వ్యక్తుల కొరకు అనవసర ఖర్చులు, వారి అభివృద్ధి విషయం కొరకు ఎక్కువ సమయాని కేటాయిస్తారు. వాహనములు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరము. దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం చేయు ప్రయత్నాలలో ఆత్మీయులను సంప్రదించి నిర్ణయాలు తీసుకొని తద్వారా ముందంజ వేయడం మంచిది. విజ్ఞానపరమైన నూతన విషయాల కొరకు సమయాన్ని సద్వినియోగ పరుచుకోవాలి. విందులు వినోదాలు అధికంగా ఉంటాయి. జ్ఞాపక శక్తిని మెరుగుపరుచుకోవాలి. సంతానానికి సంబంధించిన విద్యాపరమైన ఖర్చులు, విదేశీ అవకాశాలు. దూర ప్రదేశాలలో ఉండే ఆత్మీయులు సహకరిస్తారు. వారం మధ్యలో శుభకార్యములకు, కొరకు ఖర్చులు అధికం.

# సినిమా రివ్యూ

కన్నడ కథానాయకుడు శివ రాజ్ కుమార్ తెలుగు ప్రేక్షకులకు తెలుసు. బాలకృష్ణ 'గౌతమిపుత్ర శాతకర్ణి', రజనీకాంత్ 'జైలర్' సినిమాల్లో అతిథి పాత్రలు చేశారు. రామ్ గోపాల్ వర్మ 'కిల్లింగ్ వీరప్పన్'లో హీరోగా నటించారు. విజయ దశమి సందర్భంగా అక్టోబర్ 19న కన్నడలో విడుదలైన ఆయన 'ఘోస్ట్' సినిమా తాజాగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ఎలా ఉంది? ఏమిటి?



కథ :

మాజీ సీబీఐ అధికారి వామన్ శ్రీనివాస్ (ప్రశాంత్ నారాయణన్) 10 ఏళ్ల పోరాటం తర్వాత జైళ్ల ప్రయివేటీకరణ బిల్లుకు ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుంది. భూమి పూజ చేయడానికి వెళ్లిన వామన్ అండ్ కో పెద్ద షాక్ తగులుతుంది. వాళ్ళను కిడ్నాప్ చేయడంతో పాటు జైలులో ఓ టవర్ అంతా తమ ఆధీనంలోకి తీసుకుంటుంది ఒక గ్యాంగ్. ఈ కేసును సాల్వ్ చేయడానికి ప్రభుత్వం చరణ్ రాజ్ (జయరామ్)ని రంగంలోకి తీసుకొస్తుంది. జైలులో ఉండి ఈ ప్లాన్ అమలు చేస్తున్నది బిగ్ డాడీ (శివ రాజ్ కుమార్) అని చరణ్ రాజ్ తెలుసుకుంటాడు. అసలు, ఆ బిగ్ డాడీ ఎవరు? వామన్ శ్రీనివాస్ జైలుకు వెళ్ళినప్పుడు టార్గెట్ చేయడం వెనుక కారణం ఏమిటి? ఆ జైలులో వెయ్యి కేజీల బంగారం కథ ఏమిటి? జైలు నుంచి బిగ్ డాడీ ఎలా తప్పించుకున్నాడు? చివరకు ఏమైంది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ :

తెలుగు, కన్నడ, తమిళ్, హిందీ అని తేడాలు లేవు. ఈ మధ్య ప్రతి ఇండస్ట్రీలో గ్యాంగ్ స్టర్ డ్రామాలు ఎక్కువ అయ్యాయి. హీరోని లార్జర్ దేన్ లైఫ్ క్యారెక్టర్లో చూపించడం కామన్ అవుతోంది. శివ రాజ్ కుమార్ (%హ్వజఙఋ ఖుఙఎబఝితీ%)ను సైతం ఆ విధంగా చూపించడం కోసం తీసిన సినిమా 'ఘోస్ట్'.సాధారణంగా తీవ్రవాదులు జైలులో ఉన్న తమ వాళ్ళను విడిపించుకోవడం కోసం సామాన్యులను కిడ్నాప్ చేసి ప్రభుత్వానికి తమ డిమాండ్లు వినిపిస్తారు. 'ఘోస్ట్'లో కొత్త పాయింట్ ఏమిటంటే.. జైలుకు వెళ్లి అక్కడ ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్న మాజీ సీబీఐ అధికారిని ఒకరు కిడ్నాప్ చేస్తే... అక్కడి నుంచి తప్పించుకోవడం సులభమా? కదా? అనేది క్లుప్తంగా కథ. ఇదీ విజయ్ 'బీస్ట్' తరహా చిత్రమే. క్లైమాక్స్ రవితేజ 'కిక్'ను గుర్తు చేస్తుంది. ఏకంగా స్టేట్ సీఎం కొడుకుని ఆయన ముందు షూట్ చేయగల దమ్మున్న గ్యాంగ్ స్టర్ పాత్రలో హీరో శివన్నను చూపించడం వల్ల కథకు కావాల్సినంత హీరోయిజం దొరికింది. కథగా చూస్తే కమర్షియల్ సినిమాకు కావాల్సిన హంగులన్నీ 'ఘోస్ట్'లో ఉన్నాయి. అయితే... కథనం, దర్శకత్వంలో ప్రేక్షకులలో క్యూరియాసిటీ కలిగించే విధంగా లేవు.'ఘోస్ట్'లో స్క్రీన్ ప్లే సినిమాకు బిగ్గెస్ట్ మైనస్. ఫస్టాఫ్ కంగాళీగా, గజిబిజిగా తీశారు. కేవలం హీరోయిజం అన్నట్టు మాత్రమే కాకుండా... ఫాదర్ %డ% డాటర్ సెంటిమెంట్ సీన్లు యాడ్ చేశారు. అవి కథకు అడ్డు తగిలాయి. ప్రేక్షకుల దృష్టి పక్కకు వెళ్లేలా చేశాయి. సెంటిమెంట్ సీన్లలో పాత్రల మధ్య బలమైన సంఘర్షణ లేదు. న్యూస్ యాంకర్ తండ్రి జైలులో ఎందుకు ఉంటారో? ఆయన కుమార్తెను మోటివేట్ చేయడం ఏమిటో అర్థం కాదు. ఓ ఖైదీ మరణం, తమ్ముడి ఆత్మహత్య వంటి సన్నివేశాల్లో ఎమోషన్ లేదు. ఆ సీన్లు బలవంతంగా ఇరికించినట్లు ఉంటాయి. న్యూస్ ఛానల్స్ లైవ్ కవరేజ్ సీన్లు రొటీన్. తెలుగు డబ్బింగ్ క్వాలిటీ అసలు బాలేదు. హీరో సొంతంగా డబ్బింగ్ చెప్పారు. మిగతా ఆర్టిస్టులకు ప్రొఫెషనల్స్ చేత డబ్బింగ్ చెప్పించి ఉంటే బావుండేది.

దర్శకుడు శ్రీని ఎంపిక చేసుకున్న కాన్సెప్ట్ బావుంది. కానీ, తెరకెక్కించిన తీరులో ఆయన తడబాటుకు గురి అయ్యారు. యాక్షన్ సీన్లను, ఇంటర్వెల్ తర్వాత కథను బాగా డిజైన్ చేసిన ఆయన... కమర్షియల్ ప్యాకేజీలో ప్రేక్షకులకు రేసీ సినిమాను ఇవ్వడంలో వెనకడుగు వేశారు. సెంటిమెంట్ సీన్లు కథలో వేగాన్ని తగ్గించాయి. అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్ కాస్త... రెగ్యులర్ మెలో డ్రామా మూవీగా మారింది. సీక్వెల్ కోసం అన్నట్లు అసలు కథలో కీలకమైన అంశాలకు ముగింపు ఇవ్వలేదు. నిదానంగా సాగుతున్న సినిమాకు సంగీత దర్శకుడు అర్జున్ జన్యా విపరీతమైన హై తీసుకొచ్చారు. శివ రాజ్ కుమార్ హీరోయిజం ఎలివేట్ చేసేలా ఆయన ఇచ్చిన నేపథ్య సంగీతం బావుంది. కొత్త సౌండ్స్ వినిపించారు. సినిమాటోగ్రఫీ బావుంది. సినిమాలో ఎక్కువ శాతం జైలులో జరుగుతుంది. ఒకేచోట సినిమా సాగుతున్న ఫీలింగ్ ప్రేక్షకులకు కలగకుండా ప్రొడక్షన్ డిజైన్ ఉంది. కనీసం తెలుగు వరకు అయినా కొన్ని అనవసరమైన సన్నివేశాలకు కత్తెర వేస్తే బావుండేది. ట్విస్టులు ఊహించడం పెద్ద కష్టం ఏమీ కాదు.

నటీనటులు ఎలా చేశారంటే... :

కన్నడలో శివ రాజ్ కుమార్ స్టార్! ఆయన స్టార్ డమ్ దృష్టిలో పెట్టుకుని దర్శకుడు శ్రీని కొన్ని సీన్లు డిజైన్ చేశారు. శివన్న కూడా కేవలం కళ్ళతో ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చారు. టెక్నాలజీ ద్వారా యంగ్ శివన్నను పతాక సన్నివేశాల్లో చూపించడం ఆయన అభిమానులకు సంతోషం కలిగించే అంశం. పోలీస్ అధికారి పాత్రలో జయరామ్ సెట్ అయ్యారు. నటుడిగా ఆయనకు ఈ తరహా రోల్స్ చేయడం కొత్త ఏమీ కాదు. వామన్ శ్రీనివాసన్ పాత్రలో ప్రశాంత్ నారాయణన్, విలేకరి లక్ష్మిగా 'కెజియఫ్' మదర్ ఫేమ్ అర్చనా జాయిస్ కనిపించారు. సత్య ప్రకాష్‌కు ఇటువంటి క్యారెక్టర్లు కొత్త కాదు. కానీ, చాలా రోజుల తర్వాత ఆయనకు ఇంపార్టెంట్ రోల్ లభించింది. హీరోయిజం సీన్లకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడంతో నటీనటులకు తమ టాలెంట్ చూపించే అవకాశం దక్కలేదు.

చివరగా చెప్పేది ఏంటంటే... :

యాక్షన్... యాక్షన్... యాక్షన్... జస్ట్ యాక్షన్ సీన్లు, హీరోయిజం ఎలివేట్ చేసే నేపథ్య సంగీతం ఉంటే హ్యాపీగా సినిమా చూడవచ్చని కోరుకునే ప్రేక్షకుల కోసమే 'ఘోస్ట్'. స్క్రీన్ మీద శివన్న హీరోయిజం తప్ప ఇంకేమీ ఎంటర్టైన్ చేసే అంశాలు లేవు.

---

తెలుగు సినిమాలు కొన్నిటిలో తాంత్రిక పూజలు, మాంత్రిక విద్యలు, చేతబడి వంటి నేపథ్యంలో సన్నివేశాలు ఉన్నాయి. అయితే పూర్తిగా చేతబడి నేపథ్యంలో వచ్చిన సినిమా మా ఊరి పొలిమేర. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. సత్యం రాజేష్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య ప్రధాన పాత్రల్లో నటించారు. ఓటీటీలో విడుదలైన ఆ సినిమాకు ప్రశంసలు వచ్చాయి. ఇప్పుడు సీక్వెల్ తెరకెక్కించారు. మా ఊరి పొలిమేర 2ను థియేటర్లలో విడుదల చేశారు. ఈ సినిమా ఎలా ఉంది?




కథ :

జాస్తిపల్లి పోలీస్ స్టేషనుకు కొత్త ఎస్సై రవీంద్ర నాయక్ (రాకేందు మౌళి) వస్తాడు. 'ఒకే చితిలో రెండు శవాలు' వార్త సంచలనం కావడంతో ఆ ఊరు, అక్కడి ప్రజల గురించి ఆయనకు ఐడియా ఉంది. కేసు వేసిన జంగయ్య (బాలాదిత్య) చివరి నిమిషంలో వెనక్కి తగ్గడం, ఆ తర్వాత నుంచి కనిపించకుండా పోవడంతో అతడిపై రవీంద్ర అనుమానం వ్యక్తం చేస్తాడు. పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని పారిపోయాడేమో అంటాడు. అతని నిజాయితీ గురించి స్టేషనులో జనాలు చెప్పడంతో... అసలు జంగయ్య ఏమయ్యాడో అని ఇన్వెస్టిగేట్ చేయడం స్టార్ట్ చేస్తాడు.

జంగయ్య గురించి ఆరా తీసిన రవీంద్రకు బలిజ ('గెటప్' శ్రీను) ద్వారా కేరళలో కొమరయ్య ('సత్యం' రాజేష్) కనపడతాడు. చిన్నప్పుడు తాను ప్రేమించిన కవితను కాకుండా తన స్నేహితుడు బలిజ భార్యను కొమరయ్య కేరళ తీసుకు వెళ్ళాడని చెబుతాడు. అసలు, వాళ్లిద్దరూ కేరళ ఎందుకు వెళ్లారు? వాళ్ళ మధ్య సంబంధం ఏమిటి? జాస్తిపల్లి ఊరి పొలిమేరలో గుడితో పాటు కేరళలో అనంత పద్మనాభ స్వామి గుడికి... కొమరయ్య చేసే చేతబడి పూజలకు సంబంధం ఏమిటి? కొమరయ్య చేసే చేతబడి గురించి భార్య లక్ష్మి (కామాక్షీ భాస్కర్ల)కు తెలుసా? జంగయ్య ఏమయ్యాడు? చివరకు ఏం తెలిసింది? అనేది సినిమాలో చూడాలి.

విశ్లేషణ :

హిట్ సినిమా లేదా ప్రశంసలు పొందిన సినిమాకు సీక్వెల్ అంటే ప్రేక్షకుల్లో కొన్ని అంచనాలు ఉంటాయి. 'మా ఊరి పొలిమేర' ఓటీటీలో విడుదల కావడంతో థియేటర్లకు వచ్చే ప్రేక్షకులతో పాటు ఇళ్ళల్లో జనాలు కూడా చాలా మంది చూశారు. అందువల్ల, 'పొలిమేర 2'కు బజ్ ఏర్పడింది. అంచనాలు ఉంటాయని తెలిసినప్పుడు దర్శక నిర్మాతలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. విమర్శలను దృష్టిలో పెట్టుకుని రిపీట్ కాకుండా చూసుకోవాలి.


'మా ఊరి పొలిమేర' చూడని ప్రేక్షకులు సైతం 'పొలిమేర 2'కు హ్యాపీగా వెళ్ళవచ్చు. అందులో కథనంతా 'కట్టే కొట్టే తెచ్చే' తరహాలో టైటిల్స్ పడేటప్పుడు క్లుప్తంగా చెప్పారు. ఆ తర్వాత అసలు కథలోకి వెళ్లడానికి చాలా సమయం తీసుకున్నారు దర్శకుడు అనిల్ విశ్వనాథ్. ఇంటర్వెల్ వరకు వచ్చే ట్విస్టులు ఆకట్టుకోవడం కష్టం. 'సత్యం' రాజేష్ బతికి ఉన్న విషయం ఊరికి కొత్తగా వచ్చిన ఎస్సైకు తెలియదేమో! కానీ, బలిజ (గెటప్ శ్రీను)తో పాటు లక్ష్మి (కామాక్షీ భాస్కర్ల)కు తెలుసుగా! జంగయ్య ఏమయ్యాడో అని మొదలు పెట్టిన ఇన్వెస్టిగేషన్ ఇంటర్వెల్ వచ్చేసరికి కొమరయ్య దగ్గర ఆగడంతో 'కట్టే కొట్టే తెచ్చే' తరహాలో చెబితే మూడు సన్నివేశాల్లో పూర్తవుతుందని అనిపిస్తుంది. 'పొలిమేర 2'లో అసలు కథ ఇంటర్వెల్ తర్వాత మొదలైంది. ఇంటర్వెల్ తర్వాత వచ్చిన ట్విస్టులు సర్‌ప్రైజ్ చేస్తాయి. సస్పెన్స్ మైంటైన్ చేశారు. మధ్య మధ్యలో చిన్న చిన్న థ్రిల్స్ ఇచ్చారు. అయితే... కథలో ఫ్లాష్ బ్యాక్ సీన్లు ఎక్కువ. పార్ట్ 3 కోసం అన్నట్టు గుడి మిస్టరీని దాచడంతో కథను అసంపూర్తిగా ముగిసింది. నేపథ్య సంగీతం బావుంది. చివరిలో వచ్చే పెంచల్ దాస్ పాట పర్వాలేదు. ప్రొడక్షన్ డిజైన్ ఇంకా ఇంప్రూవ్ కావాలి.

నటీనటులు ఎలా చేశారంటే... :

కొమరయ్య పాత్రకు 'సత్యం' రాజేష్ మరోసారి న్యాయం చేశారు. అలవాటైన పాత్ర కావడంతో ఈజీగా చేసుకుంటూ వెళ్లారు. 'పొలిమేర 2'లో కొన్ని సన్నివేశాలు 'మా ఊరి పొలిమేర'తో పాటు చిత్రీకరణ చేయడమో? మరొకటో? 'సత్యం' రాజేష్ పెట్టుడు గడ్డం స్క్రీన్ మీద స్పష్టంగా కనబడుతూ ఉంటుంది. అది కొంచెం ఇబ్బంది కలిగించే అంశం. 'సత్యం' రాజేష్ కంటే 'పొలిమేర 2'లో కామాక్షీ భాస్కర్ల క్యారెక్టర్ ఎక్కువ సర్‌ప్రైజ్ చేస్తుంది. పతాక సన్నివేశాల్లో ఆవిడ ద్వారా కొన్ని ట్విస్టులు రివీల్ చేశారు. నటిగా కూడా చక్కగా చేశారామె. 'గెటప్' శ్రీను, రాకేందు మౌళి, రవి వర్మ తదితర ఆర్టిస్టులు తమ పాత్రల పరిధి మేరకు చేశారు. పృథ్వీరాజ్, బాలాదిత్యలవి ఈ సినిమాలో అతిథి పాత్రలు. మూడో పొలిమేరలో వాళ్ళిద్దరూ కీలకం అని క్లైమాక్స్ చూస్తే అర్థం అవుతుంది.

చివరగా చెప్పేది ఏంటంటే :

ఇంటర్వెల్ ముందు వరకు కథలో డ్రామా %డ% సాగదీత ఎక్కువ. ఇంటర్వెల్ తర్వాత ట్విస్టులు ఎక్కువ. 'పొలిమేర 3' కోసం బలమైన కథను సిద్ధం చేసుకునే క్రమంలో 'పొలిమేర 2' కథలో సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలను ఒక స్థాయికి పరిమితం చేశారు. 'మా ఊరి పొలిమేర' అభిమానులు సైతం ఎటువంటి అంచనాలు లేకుండా వెళితే శాటిస్‌ఫై అవుతారు.


వరుణ్ తేజ్,
లావణ్య త్రిపాఠి